# నవతరం

RNI NO. APTEL/2014/58326

తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 63 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

24-12-2025 బుధవారం వెల : 1/- పేజీలు : 4


# 48 గంటల్లో బ్యాంకు గ్యారంటీ తప్పనిసరి!

- లేదంటే ధాన్యం కేటాయింపులు నిలిపివేత
- రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి అచ్చెన్నాయుడు

**నవతరం -శ్రీకాకుళం**

ధాన్యం సేకరణకు ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో ముందుకెళ్తున్న నేపథ్యంలో, రైస్ మిల్లర్లు ముందస్తుగా పూర్తి స్థాయి ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. 48 గంటల్లోగా బ్యాంకు గ్యారంటీ సమర్పించని మిల్లులకు ధాన్యం అలాట్‌మెంట్ నిలిపివేస్తామని ఆయన హెచ్చరించారు. మంగళవారం శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి ఈ మేరకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యత అని పేర్కొన్న మంత్రి, ధాన్యం సేకరణ ప్రక్రియలో అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని తేల్చిచెప్పారు. జిల్లాలో మొత్తం 269 రైస్ మిల్లులు ఉండగా, వాటిలో 211 మిల్లులు ఇప్పటికీ బ్యాంకు గ్యారంటీలు సమర్పించకపోవడంపై మంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

వ్యాపారం చేయలేమనుకుంటే మిల్లులు మూసేయండి.. నష్టం వస్తుందంటే ధాన్యం కొనుగోలు చేయకండి.. కానీ రైతులను మాత్రం ఇబ్బంది పెట్టొద్దు.. అంటూ మిల్లర్లకు స్పష్టమైన హెచ్చరిక చేశారు.

బ్యాంకు గ్యారంటీ లేకపోతే ఆన్‌లైన్‌లో ధాన్యం కేటాయింపులు కనిపించవని, రైతుల నుంచి కొనుగోలు చేసే అవకాశం కూడా ఉండదని మంత్రి వివరించారు. రైతులకు 24 గంటల్లోగా నగదు చెల్లింపుల కోసం ప్రభుత్వం రూ.12 వేల కోట్లను సిద్ధం చేసిందని, మిల్లర్ల నిర్లక్ష్యం వల్ల ఈ ప్రక్రియకు ఆటంకం కలగకూడదని సూచించారు.

**తూకంలో మోసాలు చేస్తే కఠిన చర్యలు:**

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు సమయంలో క్వింటాల్‌కు 7-8 కిలోల వరకు తరుగు పేరుతో అక్రమ కోత జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు మొత్తం వ్యవస్థకే మచ్చ తెస్తాయని అన్నారు. ధాన్యం సేకరణలో అవకతవకలను అరికట్టేందుకు మూడు డివిజన్ కేంద్రాల్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తూకంలో తేడాలు ఉంటే రైతులు నేరుగా ఆర్డీవో కార్యాలయాల్లోని టోల్ ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేయాలని, 24 గంటల్లో తనిఖీ చేసి తప్పు తేలితే సంబంధిత మిల్లులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. బ్యాంకు గ్యారంటీల సమర్పణలో ఏవైనా సాంకేతిక ఇబ్బందులు ఉంటే నేరుగా తనను సంప్రదించాలని మిల్లర్లకు సూచించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ కొన్ని మండలాల నుంచి ఇంకా గ్యారంటీలు రాకపోవడాన్ని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు బోయిన రమేష్ మాట్లాడుతూ.. గత పదేళ్లుగా జిల్లాలో సుమారు రూ.400 కోట్ల విలువైన బ్యాంకు గ్యారంటీలు ఇస్తున్నామని, ఒక్కసారిగా వాటిని పెంచడం కొంత ఇబ్బందిగా ఉందని తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి.. పౌరసరఫరాల శాఖ ఎండీతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. 1:3 గ్యారంటీలను పెంచేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. జిల్లాలో ఈ ఏడాది 6.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 3.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు మంత్రి వెల్లడించారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, సివిల్ సప్లైస్ డీఎం వేణుగోపాల్, ఆర్డీవోలు సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, వెంకటేష్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రతినిధులు శాసనపురి మురళీకృష్ణ, తంగుడు నాగేశ్వరరావు, చైతన్య ప్రభు, లాడే రమేష్, మాజీ అధ్యక్షులు వాసు, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

# అన్యాక్రాంతమా? అస్సలు సహించను



- అధికారులకు స్పష్టమయిన ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు
- రెవెన్యూ రికార్డులు తారుమారుచేసిన అధికారులకు కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు
- టెక్కలిలో ఆక్రమిత ప్రభుత్వభూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్, జేసీలకు ఆదేశాలు

**నవతరం -శ్రీకాకుళం**

గత ప్రభుత్వ హయాంలో తప్పుడు పత్రాలు సృష్టించి కోట్ల విలువైన భూమిని అన్యాయంగా దోచుకుని, తమ స్వాధీనం చేసుకున్నారని వీటిపై యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం చర్యలు తీసుకొని తిరిగి స్వాధీనం చేసుకునే విధంగా జిల్లా యంత్రాంగం అంతా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ లకు రాష్ట్ర వ్యవసాయ శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. స్థానిక జెడ్పీ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే గత పాలకుల తీరు కారణంగా అన్యాక్రాంతమైన పేదల భూమి చట్టపరంగా, న్యాయపరంగా తిరిగి ప్రభుత్వానికే దక్కే విధంగా ఆధార సహితంగా సంబంధిత అన్ని పత్రాలూ ప్రభుత్వం దగ్గర ఉన్నాయన్నారు. వీటిని తక్షణమే స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆస్తులు ఇకపై అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిదీ అన్నారు. ఇటువంటి ఘటనలలో గత పాలకుల అండతో.. రికార్డులు తారుమారు చేసిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. టెక్కలి నియోజకవర్గ కేంద్రంగా ముఖ్యమైనటువంటి రైతు బజార్, అదే విధంగా సుమారు ఇరవై ఎకరాల ప్రభుత్వ భూమిని కొంత మంది ఆక్రమణలకు గురి చేశారని, వాటిని కూడా తిరిగి ప్రభుత్వ పరిధిలో తీసుకుని, తిరిగి స్వాధీనం చేసుకునేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. టెక్కలి నియోజకవర్గానికి సంబంధించి భూముల ఆక్రమణలపై సంబంధిత రెవెన్యూ రికార్డులను పరిశీలించి సమస్య పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఆక్రమిత స్వర్ణకారుల సంఘానికి స్థలం (చింతలగార, సర్వే నంబర్ 7లో 20 ఎకరాలు) వెంటనే స్వాధీనం చేసుకోవాలని హుకుం జారీ చేశారు. అలానే టెక్కలి మిస్సమ్మ బంగ్లా ఆక్రమణలో ఉందని, దీనిని కూడా స్వాధీనం చేసుకోవాలని, టెక్కలి రైతు బజారుకు చెందిన ప్రభుత్వ స్థలం ఆక్రమణలో ఉందని, దీనిని కూడా వెంటనే ప్రభుత్వాధికారులు స్వాధీనం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో టెక్కలి, పలాస, శ్రీకాకుళం రెవిన్యూ డివిజన్లు అధికారులు పాల్గొన్నారు.

# మారుతి మోడరన్ రైస్ మిల్ ఓనర్ పై ప్రభుత్వం చర్య తీసుకోవాలి

- బస్తాకు అదనంగా మూడు కిలోల ధాన్యం అడ్డగోలు దోపిడీ
- జలంత్రి పొత్తంగి రైతు సాలిన నరసింహా యాదవ్ ఆరోపణ

**నవతరం -మందస**




ఆరుగాలం శ్రమించే అన్నదాతల పండించే ధాన్యాన్ని కుంటి సాకులు చెబుతూ అక్రమంగా ఒక ధాన్యం బస్తాకు అదనంగా మూడు కేజీలు చొప్పున 83 కిలోల వరకు రైస్ మిల్లర్లు దోచుకుంటున్నారని సోంపేట మండలం జలంత్రి పొత్తంగి గ్రామానికి చెందిన రైతు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సాలిన నరసింహ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మందస మండలం బాలిగాం లో ఉన్న మారుతి మోడరన్ రైస్ మిల్లు వద్ద మీడియాతో మాట్లాడుతూ, తాను సన్నకారు రైతునని, ఖరీఫ్ సీజన్ లో పండించిన ధాన్యాన్ని మందస మండలం బాలిగాం లో గల శ్రీ మారుతి మోడరన్ రైస్ మిల్ కి ధాన్యం అమ్మకానికి తరలించడం జరిగిందని, అయితే ప్రభుత్వ నిబంధన ప్రకారం ఒక ధాన్యం బస్తా 80 కేజీలు కొనుగోలు చేయవలసిన మిల్లు యజమాని గున్న బాబురావు తాను పండించిన ధాన్యాన్ని పరిశీలించి, అదనంగా ఒక ధాన్యం బస్తా కు అదనంగా మూడు కిలోలు చొప్పున ఇవ్వాలని, లేకపోతే ధాన్యం అన్లోడ్ చేసే ప్రసక్తి లేదని, అంతేకాక ఒక ధాన్యం బస్తా టాక్టర్ నుంచి దింపడానికి 20 రూపాయలు చొప్పున చెల్లించాలంటూ, అదనంగా ట్రాక్టర్ బాడుగ తోపాటు డ్రైవర్ బేటా చెల్లించాలని డిమాండ్ చేశారని నరసింహ యాదవ్ ఆరోపించారు. తాను పండించే ధాన్యం ఎంతో నాణ్యత ప్రమాణం కలిగి ఉన్నప్పటికీ, తేమశాతం, నూకలు, తరుగు పేరుతో ఒక్కో బస్తాకు అదనంగా మూడు కిలోల చొప్పున ధాన్యం చెల్లించాలని. లేకపోతే.. ధాన్యాన్ని ఇంటికి పట్టుకు పో.. అంటూ మిల్లు యజమాని గున్న



బాబురావు నిర్లక్ష్యంగా మాట్లాడిన తీరు బాగోలేదు అన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు విషయంలో చెప్పిన నిబంధనలకు, మిల్లర్లు పెట్టే కుంటి సాకులకు చాలా తేడా ఉందని, మిల్లర్లు చెప్పిందే వేదంగా మారుతుందన్నారు. మిల్లర్లు ఎంత మేరకు డిమాండ్ చేస్తే అంత ధాన్యం అదనంగా రైతు చెల్లించవలసిన పరిస్థితి ఏర్పడిందని, ఒక విధంగా రైతుల నుంచి అడ్డగోలుగా ధాన్యాన్ని దోచుకుంటున్న దారి దోపిడీగాలుగా అభివర్ణించవచ్చునని ఆయన వ్యాఖ్యానించారు. ఇష్టముంటే అమ్ము.. లేకుంటే పొమ్ము.. అన్న చందాన మిల్లర్ల అడ్డగోలు దోపిడీకి రైతులు బలైపోతున్నారని, తనకు జరిగిన అన్యాయం ఇతర రైతులకు కూడా అలాగే జరుగుతుందని, ఇదే తరహా దోపిడీ జిల్లావ్యాప్తంగా జరిగినట్లు స్పష్టమవుతుందన్నారు. ప్రధానంగా బాలిగాం గ్రామపంచాయతీ పరిధిలో గల శ్రీ మారుతి మోడరన్ రైస్ మిల్ యజమాని గున్న బాబురావు రైతుల నుంచి అడ్డగోలుగా ధాన్యాన్ని అదనపు పేరిట దోచుకుంటున్న తీరుపై తక్షణం సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామని సాలిన నరసింహ యాదవ్ హెచ్చరించారు.

# 26న రథసప్తమిపై ప్రజాభిప్రాయ సేకరణ

జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



**నవతరం -శ్రీకాకుళం**

అరసవల్లి క్షేత్రంలో రథసప్తమి వేడుకలను భక్తుల మనోభావాలకు అనుగుణంగా, అత్యంత వైభవంగా నిర్వహించడమే జిల్లా యంత్రాంగం లక్ష్యమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. వచ్చే ఏడాది జనవరి 25న జరగనున్న వేడుకలను ఈసారి ఏడు రోజుల పాటు రాష్ట్ర పండుగగా జరిపేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని.. ఈ నేపథ్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లపై చర్చించేందుకు ఈ నెల 26న ఉదయం 10.30 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేయడమే తమ ప్రధాన ఉద్దేశమని ఆయన వివరించారు. ఈ సమావేశానికి గౌరవ ప్రజాప్రతినిధులు, ఆలయ సంప్రదాయాలు తెలిసిన పెద్దలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు (ఎన్జీవోలు), వ్యాపార, రవాణా రంగాల ప్రతినిధులతో పాటు సామాన్య భక్తులు కూడా హాజరై తమ సలహాలు అందజేయవచ్చని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ఉత్సవాల నిర్వహణ, భక్తుల సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణపై ఎవరైనా తమ అమూల్యమైన సూచనలు ఇవ్వవచ్చని, వాటిని నిశితంగా పరిశీలించి తుది నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి, అరసవల్లి ఆలయ ఈఓ, ప్రధాన అర్చకులు సహా రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొనాలని ఆదేశించారు.

# విద్యుత్ రంగ అభివృద్ధిపై కూన సమీక్ష




2లో

ఎడిటోరియల్

# "అణు" సమర్పణం

కేంద్రప్రభుత్వం తెచ్చిన "అణుశక్తి ప్రయివేటీకరణ బిల్లు" మనదేశ అణువిధానంలో ఒక ప్రమాదకరమైన మలుపు. ప్రభుత్వ నియంత్రణ, జాతీయ భద్రత, ప్రజల జీవనహక్కు వంటి మౌలిక అంశాలను ప్రశ్నార్థకంగా మారుస్తూ.. అణుశక్తిని పెట్టుబడికి అప్పగించే ఏలినవారి కుతంత్రాలకు నిదర్శనం. ఈ బిల్లు ఆమోదం పొందిన తీరే వారి ఉద్దేశ్యాన్ని బహిర్గతం చేస్తోంది. పార్లమెంటులో విస్తృతచర్చకు తావు లేకుండా, స్టాండింగ్ కమిటీకి పంపకుండా, శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు, ప్రతిపక్షాలు లేవనెత్తిన ఆందోళనలను పూర్తిగా పక్కనపెట్టి, సంఖ్యా బలంతో చట్టాన్ని నెగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్లింది. ఇలా ప్రజాస్వామ్యంలో విధాన నిర్ణయాలకు అవసరమైన ప్రజావాదనలను నిర్లక్ష్యం చేయడం ప్రమాదకర సంకేతం. అణుశక్తి వంటి అత్యంత వ్యూహాత్మక రంగంలో ప్రయివేటు పెట్టు బడులకు ద్వారాలు తెరవడమంటే కోరి కొరివితో తలగోక్కోవడమే. ఇది సాధారణ మౌలిక వసతి రంగం కాదు. జాతీయ భద్రత, పర్యావరణ రక్షణ, తరతరాల ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న అత్యంత కీలకమైన రంగం. అలాంటి రంగంలో "పెట్టుబడుల ఆకర్షణ", "సామర్థ్య విస్తరణ" అనే ఆర్థిక పదజాలం మాటున ప్రజల ప్రాణాలను, దేశ ప్రయోజనాలను బలిచేయడానికి కేంద్రం పూనుకోవడం ఆందోళనకరం.

అణుశక్తి అంటేనే అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ప్రమాణాలు అవసరమైన రంగం. దేశ రక్షణ, అంతర్జాతీయ ఒప్పందాలతో ముడిపడి ఉన్న రంగం. కేవలం ఓ సాధారణ విద్యుత్ ఉత్పత్తి రంగం కాదు. ఒక చిన్న తప్పిదం కూడా మహావిపత్తుగా మారే స్వభావంగల సున్నితమైన రంగం. ఏ చిన్న వైఫల్యం తలెత్తినా దాని ప్రభావాలు కొన్ని తరాల వరకూ కొనసాగే ప్రమాదకరమైన రంగం. ఈ కారణాల వల్లనే స్వాతంత్ర్యం తర్వాత భారతదేశం ఈ రంగాన్ని పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే ఉంచింది. ఇది యాదృచ్ఛిక నిర్ణయం కాదు. అణుశక్తి అనేది కొందరి లాభాల కోసం కాదు, ప్రజలందరి ప్రయోజనాల కోసమని అప్పటి నాయకత్వం భావించింది. అందుకే అణుశక్తిపై పూర్తిగా ప్రభుత్వ నియంత్రణ, భద్రత పట్ల రాజ్యం బాధ్యత, పార్లమెంటరీ పర్యవేక్షణ, ప్రజలతో చర్చలకు అవకాశం అనే సూత్రాలపై ఈ రంగాన్ని నిర్మించింది. ఇప్పటి నాయకత్వం ఈ చారిత్రక దృక్పథాన్ని విస్మరించి, అణుశక్తిని ప్రయివేటు పెట్టుబడులకు అప్పగించజూస్తోంది. ఇది గతాన్ని తిరస్కరించడం మాత్రమే కాదు, భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం కూడా. ఈ ప్రయివేటీకరణ బిల్లు మూడు కీలక మార్పులను ముందుకు తెచ్చింది.

మొదటిది, అణు విద్యుత్ ఉత్పత్తిలో ప్రయివేటు సంస్థలకు ప్రత్యక్ష ప్రవేశం. రెండోది, అణుప్రమాదాల బాధ్యతనుంచి ప్రయివేటు యాజమాన్యాలను తప్పించడం. మూడోది, 'సంస్కరణల' పేరిట భద్రతా నియమాలను సడలించడం%ౌ% ఈ మూడు కలిపి చెప్పేది ఒక్కటే. అణుశక్తిని కార్పొరేట్ వ్యాపారంగా మార్చడం. లాభాలు ప్రయివేటు కంపెనీలకు, ప్రమాదాలు ప్రజలకు. సర్కారువారి రాయితీలూ చట్టపరమైన రక్షణలు ప్రయివేటు సంస్థలకు, ప్రాణాంతకమైన ఆరోగ్య సమస్యలు, పర్యా వరణ విధ్వంసాలు, విపత్తుల భారాలు ప్రజలకు. ఇదే ఈ బిల్లు సారాంశం. ఒక అణు ప్రమాదం జరిగితే ప్రయివేటు కంపెనీలు మూతవేసి వెళ్లిపోతాయి. కానీ, అవి పోతూ వదిలిన భయంకరమైన రేడియేషన్ ప్రభావం వెళ్లిపోదు. ఇక్కడి గాలిలో ధూళిలో, నేలలో నీటిలోనే కాదు.. మానవశరీరంలోని నరనరాల్లో నిలిచిపోతుంది. ఇందుకు మూల్యాన్ని చెల్లించేది ప్రజలే. అదే ప్రభుత్వరంగంలో ఉంటే, అణుశక్తి సంస్థలపై పార్లమెంటు పర్యవేక్షణ ఉంటుంది. ప్రజలకు ప్రశ్నించే హక్కు ఉంటుంది. ప్రభుత్వాలకు జవాబు చెప్పాల్సిన బాధ్యత ఉంటుంది. కానీ ప్రైవేటీకరణతో ఈ నియంత్రణ వ్యవస్థ మొత్తం నిర్వీర్యమవుతుంది.

'వాణిజ్య గోప్యత' అనే ముసుగులో ప్రజా భద్రతకు సంబంధించిన సమాచారం రహస్యంగా మారుతుంది.

చివరికిది ప్రజాస్వామ్యాన్ని పెట్టుబడిదారుల ప్రయోజనాలకు లోబరిచే ప్రక్రియగా తయారవుతుంది. ప్రభుత్వం చెబుతున్నట్టు దేశానికి అణుశక్తి అవసరమే కావొచ్చు. కానీ అవసరాల పేరుతో అత్యంత ప్రమాదకరమైన ఈ రంగాన్ని ప్రయివేటీకరించడమే ఏకైక మార్గమా? సౌర, పవన, పునరుత్పాదక శక్తి రంగాల్లో అపార అవకాశాలు ఉన్నప్పుడు ప్రభుత్వం ఎందుకు ఈ ప్రమాదకర దారినే ఎంచుకుంది? ఈ ప్రశ్నకు సమాధానం స్పష్టం.

ఇది దేశ ప్రయోజనాల కోసం ఉద్దేశించిన అణువిధానం కాదు, కార్పొరేట్ల ధనదాహానికి ప్రభుత్వమిచ్చే బహుమానం. రాజ్యం ప్రజల పట్ల బాధ్యతలను వదిలేసి, కార్పొరేట్ల సేవలో తరించే ఏజెంట్‌గా మారుతున్న సంకేతం. కార్పొరేట్లకు మోడీ సర్కారు చేస్తున్న ఊడిగానికి ఈ బిల్లు ఒక క్లాసిక్ ఉదాహరణ.

ఇది ప్రజాస్వామ్యానికి, జాతీయ భద్రతకు తీవ్రమైన ముప్పు. నిజంగా అణుశక్తి ప్రజల కోసమే అయితే నియంత్రణ ప్రజల చేతుల్లో ఉండాలి. ఈ మౌలిక సూత్రాన్ని విస్మరించిన ఏ విధానమైనా ప్రజా వ్యతిరేకమే. ఈ బిల్లు అలాంటి ప్రజా వ్యతిరేక విధానమే.

# క్రీస్తంటే..? క్రిస్మస్ పండుగంటే..?

ప్రేమే యేసుకు ప్రాణవాయువు...
కరుణే అభిషిక్తునికి అలంకారం...
జాలి...దయ...క్షమ...త్యాగగుణాలే
ఆ దయాసాగరునికి ధగధగ మెరిసే
దవళవర్ణ వస్త్రాలు...వజ్రకిరీటాలు...

సత్యమే ఆయన నిత్య నినాదం
పాపాంధకారంలో దారి తప్పిన
గాయపడిన గొర్రెపిల్లలను వెతికి
భుజాలపై మోసి కాపాడి రక్షించే
కరుణాసాగరుడు త్యాగధనుడు...

పాపక్షమాపణకై పరితపించే
విరిగి నలిగిన హృదయాలను
తన అమృతహస్తంతో ఓదార్చి
మలినమైపోయిన మనసుల్ని
పవిత్ర జలధారలతో శుద్ధిచేసే
పరమపావనుడు ప్రభువైన క్రీస్తు...

అభిషిక్తుని బోధ ఓ అమృతధార
మరణాన్ని దహించే మంత్రదండం
అది శాంతిమయం కాంతిమయం...
ఆశ్రయించిన భక్తుల వ్యాధులు
బాధలు భయాలన్నీ మటుమాయం...

మృత్యుంజయుడైన క్రీస్తుండగా
భయమేల దండగ ఈ క్రిస్మస్ పండుగ
పాపుల్ని పరిశుద్ధులుగా మార్చేపండుగ
క్షమకు కరుణకు కారుణ్యానికి చిరునామా






కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# వేతనాలు చెల్లించాలి

## రిమ్స్ ఆవరణలో సెక్యూరిటీ గార్డుల నిరసన

**నవతరం -శ్రీకాకుళం**

రిమ్స్‌లో పనిచేస్తోన్న తమకుజీవో ప్రకారం నాలుగు నెలల వేతనాలు చెల్లించకుండా శ్రీ కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ యాజమాన్యం నిరంకుశ వైఖరి అవలంబిస్తోందని సెక్యూరిటీ గార్డ్స్ అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రిమ్స్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. శ్రీకాకుళం రిమ్స్ లో సెక్యూరిటీ గార్డ్స్ శ్రమను దోపిడీ చేస్తున్న శ్రీ కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ యాజమాన్యంపై డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారి చర్యలు తీసుకోవాలని, శ్రీకాకుళం రిమ్స్ లో సెక్యూరిటీ గార్డ్స్ పట్ల నియంతల వ్యహరిస్తోన్న శ్రీ కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ యాజమాన్యం వైఖరిని రిమ్స్ కాంట్రాక్టు , అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ సెక్యూరిటీ గార్డ్స్ అధ్యక్షుడు గొల్లపల్లి రాజులు, ప్రధాన కార్యదర్శి బగాది శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు, ఈమేరకు మంగళవారం ఉదయం పదకొండున్నర గంటల సమయంలో రిమ్స్ సెక్యూరిటీ గార్డ్స్ బకాయి వేతనాలు చెల్లించాలని,జీవో ప్రకారం వేతనాలివ్వాలని, గత ఏడు నెలలుగా జిల్లా ఉన్నత అధికారాలు, శ్రీకాకుళం శాసన సభ్యునికి వినతిపత్రాలు అందజేసినా సమస్య పరిష్కారం కాలేదని, కనీసం శ్రీ కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ యాజమాన్యానికి మన జిల్లా అన్నా, జిల్లా ప్రజాప్రతినిధులన్నా కనీస గౌరవంలేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నెలలుగా తమకు వేతనాలు లేకపోయినా డ్యూటీలు చేస్తున్నామని, ప్రభుత్వం



ఇచ్చిన జీవో ప్రకారం రూ.18,600 వేతనం చెల్లించాలని గత ఏడు నెలలుగా పోరాటం చేస్తుంటే నిమ్మకు నీరెత్తినట్టు శ్రీ కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ యాజమాన్యం మొండిగా ఉన్నారని, పండగ వేళలో వేతనాలు లేకుండా బతుకున్నామని, కుటుంబాలతో చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన రిమ్స్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

తప్పని పరిస్థితుల్లో సమ్మె నోటీసు ఇస్తున్నామని, ఈ 14 రోజుల్లో సమస్య పరిష్కారం కాకుంటే ఏ రోజైనా సమ్మెలోకి వెళ్తామని, తమకు అండగా ఉండాలని రిమ్స్ సూపరింటెండెంట్ లుకలాపు ప్రసన్న కుమార్‌ను కోరారు.

ఈ మేరకు ఆయన స్పందిస్తూ తాను ఆదేశించినా వారు రావడం లేదని, శ్రీ కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ యాజమాన్యానికి షోకాజ్ అంజేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో తణుకు సంతోషి, రాంబిల్లి బండారి, ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్, మామిడి సూర్యనారాయణ, అన్నెపు సూర్యనారాయణ, సతివాడ రాజేంద్రప్రసాద్-, మిర్తిపాటి హైమారావు, దామోదర రవికుమార్, కొల్లి ఎల్లయ్య, కళ్యాణ్ చక్రవర్తి, మద్ది శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక శాపం బాల్య వివాహం



**నవతరం -శ్రీకాకుళం**

## డీఎల్ఎస్ఏ కార్యదర్శి హరిబాబు

బాల్య వివాహాలు సామాజిక శాపమని, వీటి వల్ల బాలికల భవిష్యత్తు అంధకారమవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు ఆందోళన వ్యక్తం చేశారు. నల్సా 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంగళవారం స్థానిక వరం మున్సిపల్ హైస్కూల్‌లో బాల్య వివాహాలపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచనలతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించడంతో పాటు బాలికలకు రక్షణ కల్పించే వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తద్వారా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని హరిబాబు పిలుపునిచ్చారు. చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల ఎదురయ్యే ఆరోగ్య, న్యాయపరమైన చిక్కులను విద్యార్థినులు గుర్తించాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఎదురైతే న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది జి. ఇందిరా ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ స్థాయిలో
# స్టార్ వాకర్స్ క్లబ్ ఉత్తమం

**నవతరం -శ్రీకాకుళం**

అంతర్జాతీయ స్థాయిలో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ లో సుమారు 1600 క్లబ్స్ ఉండగా, ఈ ఏడాది ఉత్తమ సేవా క్లబ్ గా శ్రీకాకుళానికి చెందిన స్టార్ వాకర్స్ క్లబ్ ఎంపికైంది. ఈ నెల 20, 21 తేదీల్లో విశాఖపట్నం వుడా చిల్డ్రన్స్ పార్క్ లో జరిగిన వాకర్స్ అంతర్జాతీయ 34 వ వార్షిక సమావేశంలో ఈ అవార్డ్ బహూకరించారు.

ఉత్తమ చీఫ్ కో ఆర్డినేటర్‌గా పీజీ గుప్తా, ఏరియా కో ఆర్డినేటర్‌గా గేదెల ఇందిరా ప్రసాద్, ఉత్తమ గోల్డ్ డోనర్‌గా బీవీ.రవిశంకర్‌కు అవార్డ్స్ లభించాయి. జిల్లాకు నాలుగు అవార్డ్స్ రావటాన్ని పురస్కరించుకుని స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ సారథ్యంలో అభినందన నిర్వహించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి అత్యుత్తమ క్లబ్ గా అన్ని రంగాల్లో గుర్తింపు పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ కో ఆర్డినేటర్ శాసపు



జోగినాయుడు, స్టార్ వనితా వాకర్స్ క్లబ్ ప్రతినిధి జి.లక్ష్మి, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గుడ్ల జగ్గారావు, సుగంధం సంజీవరావు, గుడ్ల గోపాలరావు, పొ్శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో పొట్నూరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ రంగ అభివృద్ధిపై కూన సమీక్ష

**నవతరం-అమరావతి**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలోని విద్యుత్ సౌధలో ఏపీ ట్రాన్స్‌కో శాఖ అధికారులతో వార్షిక నివేదికలు, జనరల్ ఆక్టివిటీస్‌పై ఆమదాలవలస శాసనసభ్యుడు, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ రంగంలో అమలు చేస్తున్న పథకాలు, ప్రస్తుత పనితీరు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. విద్యుత్ సరఫరా నాణ్యతను మెరుగుపర్చడం, నష్టాలను తగ్గించడం, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన చర్యలపై అధికారులు వివరాలు వెల్లడించారు. అలాగే ట్రాన్స్‌కో పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, ఆర్థిక స్థితిగతులు, నిర్వహణలో ఎదురవుతోన్న సవాళ్లపై సమగ్రంగా సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధికి విద్యుత్ రంగం కీలకమని, ప్రజలకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్ణీత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ సమావేశంలో శాసనసభ్యుడు వసంత్ కృష్ణ ప్రసాద్, తెనాలి శ్రావణ్ కుమార్, గౌతు శిరీష, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొని తమ సూచనలు, అభిప్రాయాలను వెల్లడించారు.



# చెస్ వెంకయ్యను గుర్తించాలి

మన దేశంలో చెస్ అనగానే విశ్వనాథ్ ఆనంద్, కోనేరు హంపి తదితర క్రీడాకారుల పేర్లు గుర్తుకు వస్తాయి. కానీ డెబ్బై ఏళ్ల క్రితమే దేశంలో చెస్ కు బలమైన పునాదులు పడ్డాయి.మహారాష్ట్రకు చెందిన రామ చంద్ర భార్గవ్ సప్రే మన దేశంలో చెస్ అభివృద్ధికి విశేష కృషి చేశారు. ఆయన 1915 మార్చి 4న మహారాష్ట్రలోజన్మించారు.ఆయన ఎవరి దగ్గర ప్రత్యేకంగా ఎటువంటి శిక్షణ తీసుకోక పోయినప్పటికీ చెస్ లో అంతర్జాతీయ స్థాయిలో రాణించారు. ఆయన 1949నుండి 1976వరకు వివిధ చెస్ టోర్నమెంట్ లలో పాల్గొని విశేషంగా రాణించారు. 1955లో తొలిసారి జాతీయ స్థాయి చెస్ పోటీలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని ఏలూరులో జరిగాయి. అంతకు ముందు వివిధ ప్రాంతాల్లో ప్రాంతీయ స్థాయి చెస్ పోటీలు జరిగేవి. ఏలూరులో జరిగిన జాతీయ స్థాయి చెస్ పోటీల్లో రామ చంద్ర సప్రేతో పాటు తెలుగు వాడైన దర్భా వెంకయ్య కూడా పాల్గొని విశేషంగా రాణించారు. ఇద్దరు హెూరాహెూరీగా తలబడి సంయుక్త విజేతలుగా నిలిచారు.అయితే రామ చంద్ర కు మాత్రం గుర్తింపు వచ్చింది. ఆయన జీవిత చరిత్ర ఇండియన్ చెస్ హిస్టరీ పేరుతో బయటకు వచ్చింది. వెంకయ్యకు మాత్రం ఎటువంటి గుర్తింపు రాలేదు. ఆయనను చదరంగ భీష్మ అని కూడా పిలుస్తారు.ఆయన కాకినాడ కు చెందిన వారు. 1950నుండి 1970వరకు దేశంలో చెస్ అభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారు. ఈ ఏడాదితో తొలి జాతీయ స్థాయి చెస్ పోటీలు జరిగి 70ఏళ్లు అయింది. దేశంలో తొలి తరం చెస్ క్రీడాకారుడైన వెంకయ్యకు ఎటువంటి గుర్తింపు రాకపోవడం విచారకరం.ఆయన గురించి ఎక్కడా పెద్దగా వివరాలు లభించడం లేదు. రామ చంద్ర పేరుతో ఇప్పటికీ మహారాష్ట్రలో పలు కార్యక్రమాలు జరుగుతున్నాయి. తెలంగాణ ఆవిర్భావం అనంతరం చరిత్రలో కనుమరుగయిన పలువురిని తెలంగాణ ప్రభుత్వం గుర్తించి గౌరవించింది. ఇటీవల ఆంధ్రా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో 62వ జాతీయ స్థాయి చెస్ పోటీలు జరిగాయి. దీన్ని పురస్కరించుకొని వెంకయ్య పేరును ప్రస్థావించారు.దేశ తొలి చెస్ ఛాంపియన్ అయిన వెంకయ్య ను కూడా ప్రభుత్వం గుర్తించి గౌరవించాలి.ఆయన జీవిత చరిత్రను ముద్రించాలి.


యం.రాం ప్రదీప్

# కర్ణాటక రాష్ట్రం.... కోలార్... లవకుశల జన్మస్థలం

కోలార్ కర్ణాటక రాష్ట్రంలోని ఒక పురాతన నగరం. దీనిని గతంలో కోలాహలపురం అని పిలిచేవారు. ఇక్కడ సోమేశ్వర కోలారమ్మ వంటి పురాతన దేవాలయాలు చారిత్రాత్మక లాక్ టవర్ ఉన్నది. తెలుగు తమిళ సంస్కృతుల మిశ్రమం ఎక్కడ ప్రత్యేకత. చాళుక్యులు చోళు ల కాలములో యుద్ధభూమిగా ఉండేది. ఇక్కడ 14వ శతాబ్దపు విజయనగర శైలిలో సోమేశ్వర ఆలయం నిర్మించబడింది.ఇది కోలార్ జిల్లాకు ముఖ్య పట్టణం. ఈ నగరం పాల ఉత్పత్తికి, బంగారు గనులు ఉన్న ప్రాంతానికి చెందింది. ఇది సోమేశ్వర , కోలారమ్మ ఆలయాలకు ప్రసిద్ధి.

## కోలార్ చరిత్ర

పశ్చిమ గంగా సార్వభౌమాధికారం సా.శ. 350 నుండి 550 వరకు కొనసాగింది. ప్రారంభంలో కోలారు నగరం రాజధానిగా చేసుకుని పరిపాలించారు. పశ్చిమ గంగా రాజవంశ స్థాపకుడు కొంగనివర్మన్ మాధవ, కోలారును 350 లో తన రాజధానిగా నిర్మించి, ఇరవై సంవత్సరాలు పాలించాడు. అతని తరువాత కుమారుడు ఒకటవ మాధవుని పరిపాలన కాలంలో కోలారు జిల్లాకు ముఖ్య పట్టణం కోలారును అంతకు ముందు కువలాలా పురం అని కూడా పిలిచేవారు. కోలారు పురాణ యుగంతో సంబంధం కలిగి ఉన్నట్లు చెబుతారు, ఇది ములబాగల్ తాలూకాలో అవనితో సంబంధం ఉన్న అనేక ఇతిహాసాలను గుర్తుచేస్తుంది, దీనిని అవని క్షేత్రం అని కూడా పిలుస్తారు.

ఇది ఒకప్పుడు కర్ణాటక రాష్ట్రంలోని కోలారు జిల్లాలో పవిత్ర స్థలమైన అవంతిక- క్షేత్ర అని పిలువబడింది. ఇది ప్రాచీన కాలం నుండి మతపరమైన సంస్థలకు ప్రసిద్ధి చెందింది. ఇది ఒకప్పుడు అవన్య అని పిలువబడింది. ఇది అనేక జిల్లాలను పరిపాలించిన గంగా యువరాజు మాధవ ముత్తరస ఆధ్వర్యంలో ఉంది. సా.శ. 890 లో, కాళి యుగ రుద్ర బిరుదును కలిగి ఉన్న త్రిభువన కర్తర దేవా 40 సంవత్సరాలు అవనియ థానాను దేవా 40 సంవత్సరాలు అవనియ థానాను పరిపాలించినట్లు దాని ప్రారంభ మంజూరులో ఉంది. ఈ కాలంలో అతను 50 దేవాలయాలు, రెండు పెద్ద చెరువులను నిర్మించాడు. రామాయణ ఇతిహాసం రచయిత మహర్షి వాల్మీకి ఇక్కడ నివసించారు. సీతాదేవి, బహిష్కరణకు పంపబడిన తరువాత, అవని వద్ద తన కవలలైన లవుడు, కుశుడులకు ఇక్కడే జన్మనిచ్చింది. అవని 9 నుండి 11 వ శతాబ్దాల వరకు మతపరమైన స్థాపనగా మనుగడ కొనసాగించింది. రాముడికి అంకితం చేసిన దేవాలయాలు ఉన్నాయి.



కోలారుకు పశ్చిమాన ఉన్న కొండను శతశృంగ పర్వతం అని పిలుస్తారు. ఇది పరశురాముడి కథతో సంబంధం కలిగి ఉంది. కామధేనువు అయిన సురభి చరిత్ర ఇది ఇక్కడి కొండలపై జరిగిందని చెబుతారు.

కార్తవీర్యార్జునుడి మరణంపై 'కోలహాలం' దాని పేరును పట్టణానికి వచ్చిందని, తరువాత ఇది కోలారుగా మారిందని చెబుతారు. ఇక్కడి ప్రజలు కన్నడ, తెలుగు మాట్లాడుతారు. గంగాలు ఉత్తనూర్ ముల్బాగల్ తాలుకా శ్రీ ఉత్తమేశ్వర ఆలయాన్ని నిర్మించారు.

బెంగళూరు నుండి బంగారుపేట ద్వారా శ్రీనివాసపురం,చింతామణి, చిక్కబళ్ళపూర్, దేవనహళ్లి ద్వారా బస్సులు, టాక్సీలు,ఆటో రిక్షాలు దేవాలయానికి చేరుకోవడానికి సౌకర్యం ఉన్నది.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు



# బన్నీ - అట్లీ.. ఏంటీ మృణాల్ రోల్ అలా ఉండబోతుందా?

హీరోయిన్ మృణాల్ ఠాకూర్ గురించి అందరికీ తెలిసిందే. బాలీవుడ్ లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ఆమె.. టాలీవుడ్ లో స్పెషల్ ఫ్యాన్ బేస్ దక్కించుకుందనే చెప్పాలి. సీతారామం మూవీతో తెలుగులోకి వచ్చిన ముద్దుగుమ్మ.. తన యాక్టింగ్ తో ఒక్కసారిగా ఫిదా చేశారు. సినీ ప్రియుల మదిలో శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్నరనడంలో డౌట్ అక్కర్లేదు.

ఆ తర్వాత హాయ్ నాన్న మూవీతో మరోసారి తెలుగు మూవీ లవర్స్ ను మెప్పించారు. ఇప్పుడు డెకాయిట్ మూవీతో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. రొమాంటిక్ క్రైమ్ డ్రామాగా రూపొందుతున్న ఆ సినిమాలో అడివి శేష్ సరసన నటిస్తున్న మృణాల్ ఠాకూర్.. వచ్చే ఏడాది ఉగాది పండుగ కానుకగా థియేటర్స్ లో రానున్నారు.

అయితే ఇప్పుడు డెకాయిట్ తోపాటు పలు హిందీ సినిమాల్లో నటిస్తున్న అమ్మడు.. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్- కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్ లో రూపొందుతున్న మూవీలో యాక్ట్ చేస్తున్నారని వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ గా తెరకెక్కుతున్న ఆ సినిమాలో ఓ కీలక పాత్ర పోషిస్తున్నట్లు కొన్ని నెలల క్రితం టాక్ వినిపించింది. కానీ కొన్ని రోజులుగా ఆ మూవీలో అల్లు అర్జున్ సిస్టర్ గా మృణాల్ ఠాకూర్ యాక్ట్ చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. దానిపై మూవీ టీమ్ నుంచి ఎవరూ ఎక్కడా లీక్ చేయనప్పటికీ.. వార్తలు చక్కర్లు కొడుతూనే ఉన్నాయి. మంచి స్కోప్ ఉన్న రోల్ కావడంతో ఆమె సినిమాకు ఓకే చెప్పినట్లు ఊహాగానాలు స్ప్రెడ్ అవుతున్నాయి.

సినిమాలో బ్రదర్-సిస్టర్ బాండింగ్ నేపథ్యంలో వచ్చే సీన్స్ హత్తుకుంటాయని టాక్ వినిపిస్తోంది. ఆ ట్రాక్ మూవీ హైలైట్స్ లో ఒకటిగా నిలవనుందట. అందుకే స్టార్ హీరోకు చెల్లెలు రోల్ చేయడానికి కూడా మృణాల్ సిద్ధపడినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే అందులో నిజమెంత ఉందో మాత్రం ఎవరికీ తెలియదు. అసలు యాక్ట్ చేస్తున్నారో కూడా తెలియదు. దీనిపై మృణాల్ ఏమైనా క్లారిటీ ఇస్తారేమో చూడాలి.ఇక ఆ క్రేజీ ప్రాజెక్టు విషయానికొస్తే.. అల్లు అర్జున్ విభిన్నమైన పాత్రల్లో కనిపించనున్నట్లు సమాచారం. మెయిన్ ఫిమేల్ లీడ్ రోల్ లో దీపికా పదుకొణె యాక్ట్ చేస్తున్నారు. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. వారిద్దరితోపాటు పలువురు హీరోయిన్స్ నటిస్తున్నారని.. అందులో ఒకరు మృణాల్ అని వినికిడి. మాఫియా బ్యాక్ డ్రాప్ లో ఒక పవర్ ఫుల్ డాన్ కథగా సినిమాను అట్లీ తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తుండగా.. సన్ పిక్చర్స్ బ్యానర్ పై అత్యంత భారీ బడ్జెట్ తో కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. ఇప్పటికే సినిమా షూటింగ్ ప్రారంభమవ్వగా.. ప్రస్తుతం శరవేగంగా జరుగుతోందని టాక్.

# ఈ ఏడాది రిలీజ్ లేనట్టే


అఖండ-2 టైమ్ లోనే అకస్మాత్తుగా వాయిదా పడిన చిత్రం అన్నగారు వస్తారు. కార్తి, కృతి శెట్టి హీరోహీరోయిన్లుగా నటించిన ఈ సినిమా ఆఖరి నిమిషంలో పోస్ట్ పోన్ అయింది.

అయితే అఖండ-2 టైపులోనే ఓ వారం అటుఇటుగా రిలీజ్ అవుతుందని అంతా భావించారు. కానీ అన్నగారు వస్తారు సినిమా విడుదల కావడం లేదు.

ఈ సినిమా ఆర్థిక ఇబ్బందులు ఇప్పట్లో క్లియర్ అయ్యేలా కనిపించడం లేదు. ఈ సమస్యలు పరిష్కరించడానికి యూనిట్ కు మరింత సమయం పట్టేలా ఉంది. దీంతో కార్తి నటించిన అన్నగారు వస్తారు సినిమాను నిరవధికంగా వాయిదా వేశారు.

ఈ సినిమా కోసం గట్టిగా ప్రచారం చేశాడు కార్తి. తెలుగు వెర్షన్ ప్రమోషన్ కోసం హైదరాబాద్ కూడా వచ్చాడు. మరికొన్ని గంటల్లో రిలీజ్ అనగా సినిమా ఆగిపోయింది. కెరీర్ స్టార్టింగ్ లో ఒకసారి ఈ తరహా ఇబ్బంది ఎదుర్కొన్నాడు కార్తి, మళ్లీ ఇప్పుడిది రెండోసారి.

అన్ని లెక్కలు సెటిల్ చేసి క్రిస్మస్ కు అట్టహాసంగా విడుదల చేయాలనుకున్నారు. కానీ ఇప్పుడు ఆ తేదీకి కూడా అందుకోవడం కష్టమని దాదాపు ఓ అభిప్రాయానికి వచ్చేశారు. దీంతో కార్తి సినిమా వచ్చే ఏడాదిలోనే విడుదలవుతుందనే ప్రచారం నడుస్తోంది.



# వేణునాయుడు చరిత్ర ఆదర్శప్రాయం

## మాజీ మంత్రి ధర్మాన




**నవతరం-శ్రీకాకుళం:**

ఆదర్శప్రాయుడు, మహోన్నత వ్యక్తి వావిలపల్లి వేణుగోపాలనాయుడి (మందరాడ)చరిత్ర పుస్తక రూపంలో "బంధుత్వాలు, బాంధవ్యాలు" టైటిల్ తో రావడం ఓ ఆదర్శ ప్రయత్నమని రాష్ట్ర మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు.దీన్ని అభినందిస్తున్నానని ఆయన అన్నారు. బంధుత్వాలు, బాంధవ్యాలు అనే పుస్తకాన్ని జగన్నాథ నాయుడు మంగళవారంనాడు ధర్మానకు ఆయన నివాసంలో సమర్పించారు. ఇందులో రైతు జన బాంధవ్యుడు, విలువలతో కూడిన ఉత్తమ వ్యక్తిగా, నాయకునిగా పేరు పొందిన వేణుగోపాలనాయుడు చరిత్రను సమగ్రంగా ఉటంకించారు.

ఈ సందర్భంగా ప్రతి కుటుంబానికి ఇటువంటి చారిత్రక పుస్తకం అవసరమని ధర్మాన పేర్కొన్నారు.

# ఉన్నతమైన ఆశయాలు కోసం పనిచేయాలి



పూర్ణ చంద్రరావు

**నవతరం-శ్రీకాకుళం:**



బహుజనులు ఉన్నతమైన ఆశయాలు కోసం పనిచేయాలని ఆల్ ఇండియా బహుజన సమాజ్ వాది పార్టీ జాతీయ నాయకులు, మాజీ డి జీ పూర్ణచంద్రరావు పిలుపునిచ్చారు. ఈరోజు ఉదయం పట్టణం లోగల స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు తో సమావేశామయ్యారు. ఈసందర్బంగా అయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా అన్యాయం జరుగుతోందని అయన అన్నారు.సామజిక సమస్యలపై పార్టీ తరుపున పోరాటం చేయాలనీ పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్రలో స్థానికేతరుల ప్రాభల్యం పెరుగుతోందని దీనివలన స్థానికులుకు రాజకీయ ప్రాధాన్యత దక్కట్లేదని, స్థానికులకే ఎం పి, ఎమ్ ఎల్ ఎ టికెట్ ఇచ్చే విధంగా పోరాటం చేయాలని అయన పిలుపునిచ్చారు.

జిల్లా అధ్యక్షులు ఎమ్ వి. మల్లేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా మరియు అర్బన్ లో వివిధ అనుభంద సంఘాలును ఏర్పాటుచేసి పార్టీ ను బలోపేతం చేస్తామని తెలిపారు.

జిల్లా కార్యదర్శి ఆర్ చిన్నారావు మాట్లాడుతూ పార్టీ బలోపేతం కొరకు పార్టీ నాయకులు చెప్పిన విధంగా పార్టీని అంచెలంచెలుగా బలోపేతం చేస్తామని. తెలిపారు ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు నర్సింగ్ యాదవ్ మాట్లాడుతూ పలు సూచనలు తెలియజేశారు ఈ సమావేశంలో ఎస్ చిన్నారావు సత్యనారాయణ చైతన్య తిరుపతిరావు నాగభూషణ్ నలబారిక శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌కు భూదేవి సన్మానం



**నవతరం-పార్వతీపురం**

పార్వతీపురం మన్యం కలెక్టర్‌ను టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పడాల భూదేవి, పాలకొండ నియోజకవర్గ టీడీపీ నాయకులు మంగళవారం సన్మానించారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయనకు దుశ్శాలువ, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. పాఠశాలల్లో ముస్తాబు కార్యక్రమం చేపట్టిన కలెక్టర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భామిని మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌కు వచ్చిన సమయంలో పరిశీలించి, అనంతరం కలెక్టర్ల సదస్సులో కలెక్టర్‌ను అభినందించారు.

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ముస్తాబు కార్యక్రమం అమలుపరచాలని ఆదేశాలు జారీ చేసిన సందర్భంగా కలెక్టర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# వస్తు కొనుగోలుపై వినియోగదారులు అప్రమత్తంగా వుండాలి

- జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి సూర్యప్రకాష్
- వినియోగదారుల హక్కుల అవగాహనపై కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ విద్యార్థుల భారీ ర్యాలీ

**నవతరం-శ్రీకాకుళం:**

జాతీయ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకొని కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ, "ఆశ్రా "(అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్నెస్) ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా సివిల్ సప్లై అధికారి సూర్య ప్రకాష్, ఆశ్రా ఆర్గనైజేషన్ అద్యక్షులు గంజి ఆర్ ఎజ్రా పాల్గొని, ప్రజలకు, విద్యార్థుల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వినియోగదారుల హక్కులపై నినాదాలు చేస్తూ కళాశాల నుండి, డే అండ్ నైట్ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అధికారి సూర్య ప్రకాష్, ఆశ్రా ఆర్గనైజేషన్ అద్యక్షులు గంజి. ఎజ్రా మాట్లాడుతూ వినియోగదారుడు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు సరైన జాగ్రత్తతో బిల్లు తీసుకోవాలని , అదేవిధంగా వినియోగదారులు హక్కులపై అవగాహన ద్వారా అనవసరమైన చెల్లింపులు చేయకుండా, మోసపూరితమైన చెల్లింపులపై జాగ్రత్త





వహించాలని తెలిపారు. వస్తువుపై ముద్రించిన ఎమ్మార్పీ ధరల్ని చెల్లించాలని, నాణ్యత కలిగిన వస్తువులు మాత్రమే కొనుగోలు చేసి మోసాలను అరికట్టాలని తెలిపారు. అనంతరం కాకినాడ శ్రీ ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ ఎన్వి.వేణుగోపాల్ మాట్లాడుతూ వినియోగదారులు వారి హక్కులను సరిగ్గా తెలుసుకున్న యెడల మోసాలను అరికట్టవచ్చునని, ఈ భారీ ర్యాలీ తమ విద్యార్థుల్లో ఎంతో చైతన్యాన్ని కలిగించిందని, ప్రతి విద్యార్థి వినియోగదారుల హక్కులను, కొనుగోలు చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను చక్కగా అవగాహన చేసుకున్నారని తెలిపారు . ప్రతి ఒక్కరూ చైతన్యంతో నాణ్యమైన వస్తువులను సరియైన బిల్లుల కొనుగోలు ద్వారా వృధా ఖర్చులను అరికట్టడమే కాక దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులను అభినందించి, డిసెంబర్ 24 న ఆర్ట్స్ కళాశాల సిల్వర్ జూబ్లీ హాలులో జరిగే కార్యక్రమానికి అందరూ హాజరవ్వాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఆశ్రా ఆర్గనైజేషన్ కార్యవర్గ సభ్యులు అడ్వకెట్ పార్థసారథి , బాలకృష్ణ పట్నాయక్, గేదెల.కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ జి.జివి.సుబ్రహ్మణ్యం, యన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారి యల్ మోహన రావు, సుమారు 200 మంది విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

# రైతే దేశానికి వెన్నుముక

## ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.వై.పోలినాయుడు

**నవతరం-శ్రీకాకుళం:**

రైతే దేశానికి వెన్నుముకని, రైతు అహర్నిశలు కష్టపడితే తప్ప, మానవ మనుగడ లేదని, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.వై.పోలినాయుడు అన్నారు. స్థానిక కళాశాలలో జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా, రైతు దేశానికి ఎంత అవసరమో తెలియజేస్తూ అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. బోటనీ అధ్యాపక బృందం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన రైతు ప్రాముఖ్యత కార్యక్రమంలో ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పోలినాయుడు, ముఖ్య వక్త డా.పి .రామా రావుతో కలసి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆరోగ్యంగా కడుపు నిండా అన్నం తింటున్నామంటే అది రైతు వల్లేనని, అలాంటి రైతు ఆరు నెలలు కష్టపడినా.. ఫలితం చేతికి దక్కుతుందనే నమ్మకం లేదని, అయినా సరే రైతులు మాత్రం అటు ప్రకృతి మీద, ఇటు ప్రభుత్వం మీద భారం వేసి జీవనం కొనసాగిస్తున్నారన్నారు. ఒక వైపు అతివృష్టి.. మరో వైపు అనావృష్టి అనునిత్యం వెంటాడుతూనే





ఉంటాయని, అన్నదాతల జీవితాలకు భరోసా లేని పరిస్థితి తీసుకు వస్తున్నాయన్నారు. దేశాన్ని రక్షించే జవానులకు ఎంత ప్రాముఖ్యత ఉందో.. పట్టెడన్నం పెట్టే రైతన్నలకు కూడా అంతే ప్రాముఖ్యత ఉందని, అందుకే జై జవాన్.. జై కిసాన్ అనే నినాదం యావత్ భారతవనిలో వినిపిస్తుందని గుర్తుచేశారు. బోటనీ అధ్యాపక బృందం మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థలో రైతుల సహకారం ఎంతో ఉందని, భారతదేశం పురాతన కాలం నుండి వ్యవసాయ దేశంగా పరిగణించబడుతుందని తెలిపారు. ఇంట్లోనే కొన్ని కొన్ని ఆకు కూరలను, కొన్ని రకాల కూరగాయలను, ఎలా పండించుకోవాలో విద్యార్థులు తెలియజేసారు. అనంతరం కేరింతల మధ్య ఆట, పాటలు, నృత్యాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.ప్రదీప్, ఐక్యూఎసి కోఆర్డినేటర్ డా.రాజశేఖర్, అకడమిక్ కో ఆర్డినేటర్ డా.ఎస్.శశి భూషణం, బోటనీ హెచ్వోడి బి.రవీంద్ర, అధ్యాపకులు ఆర్.ప్రమీల, ఏ.వైష్ణవి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# మీ చేతికి.... మీ భూమి

- 22 ఏ భూ స్వేచ్ఛ..ఈ నెల 26న ప్రత్యేక డ్రైవ్
- రాష్ట్ర వ్యవసాయ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి
- రెవిన్యూ అధికారులతో సమీక్ష



**నవతరం -శ్రీకాకుళం**

ఈ నెల 26న జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 9.30, గంటలకు మీ చేతికి.. మీ భూమి 22ఏ భూస్వేచ్ఛ పేరుతో ప్రత్యేక డ్రైవ్ ను నిర్వహించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. నిషేధిత భూముల విషయమై ఎవరైనా విజ్ఞాపనలు చేసుకోవచ్చని, సంబంధిత అర్జీలను రెవెన్యూ అధికారులు పరిశీలించి బాధిత వర్గాలకు పూర్తి న్యాయం చేస్తారని వెల్లడించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజన్ అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే 22ఏ జాబితాలో నిషేధిత భూముల విషయమై కేబినెట్ లో చర్చించినట్లు వివరించారు. ఇందుకు అనుగుణంగా భూ స్వేచ్ఛ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం భూముల రీ సర్వే పేరిట రికార్డులను అన్నింటినీ అస్తవ్యస్తం చేశారని, వీటిని గాడిలో పెట్టేందుకు, ప్రజల నుండి అభ్యంతరాలు స్వీకరించేందుకు, రికార్డుల నిర్వహణలో పారదర్శకత పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. అర్హత ఉండి, గత పాలకుల తప్పిదం కారణంగా 22ఏ జాబితాలోకి చేరిన భూముల విషయమై తమ దృష్టికి ఆ రోజు తీసుకుని వస్తే సంబంధిత చర్యలను వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం దక్కేలా చేస్తామన్నారు. 22 ఏ, 22-1 ఏ, 22-1 బీ, 22-1సీ, 22-1 డీ జాబితాలలో గత పాలకుల తప్పిదం కారణంగా ఎవరైనా చేరి పోయి ఉంటే, రెవెన్యూ అధికారులు నిర్వహించే భూ స్వేచ్ఛ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆ..రోజు జిల్లా వ్యాప్తంగా మూడు రెవెన్యూ డివిజన్లకు చెందిన ఆర్డీఓలు, అన్ని స్థాయిలలో పనిచేస్తున్న రెవెన్యూ యంత్రాంగం హాజరవుతుందని, జిల్లా కలెక్టర్ వీరికి మార్గనిర్దేశం చేస్తారని తెలిపారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**